చిన్నకథ

# పండుగ

## దూరి వెంకట్రావు



''బీరువాలో పెట్టిన డబ్బు కనిపించడం లేదండి'' కంగారుపడుతూ అన్నది భారతమ్మ. భార్య పేల్చిన బాంబుకు అదిరిపడుతూ ''సరిగ్గా చూసావా?'' అని అడిగాడు భానుమూర్తి. ''చూసానండి బట్టలన్నీ బయటకుతీసి మరీ చూసాను.'' తన స్వహస్తాలతో పెట్టిన వంద రూపాయల కట్ట మాయమవడంతో మతిపోయింది భానుమూర్తికి. మరి నోట మాట రాలేదు. కుప్పలా కుర్చీలో కూలబడి పోయాడు. ఇంచుమించు భారతమ్మ పరిస్థితి అంతే.

భానుమూర్తి ఓ ప్రవేటు సంస్థలో అకౌంట్లు రాస్తుంటాడు. నెలంతా పని చేస్తే వచ్చే చాలీ చాలని జీతంతో అతికష్టం మీద రోజులు నెట్టుకొస్తున్నాడు. ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి అతడి సంతానం. పైసా పైసా కూడబెట్టి ఎలాగో ఆడపిల్లలిద్దర్నీ అత్తవారిళ్లకు పంపగలిగాడు. కొడుకు కూడా తనలాగే ఓ ప్రెస్‌లో కంప్యూటర్ ఆపరేటరు. కోడలు పిల్ల కాన్వెంటు స్కూల్లో టీచరమ్మగా పని చేస్తూ పదోపరకో పట్టుకొచ్చి వేడినీళ్ళకు చన్నీళ్ళలా సహాయపడుతుంది.

ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పోవడంతో ఇంతవరకు ఏ అల్లుణ్ణి సంక్రాంతి పండగకి పిలవలేదు. ఈ ఏడు కూడా వాళ్ళకి మొండిచెయ్యి చూపించడమిష్టంలేక తను పనిచేసే యజమానిని బ్రతిమలాడి వాయిదాల పద్ధతిలో విరగ్గొట్టుకోమని చెప్పి పదివేలు అడ్వాన్సు తీసుకున్నాడు. పట్టుకొచ్చిన సొమ్ము బీరువాలో పెట్టి పండక్కి అల్లుళ్ళని రమ్మని ఫోన్ చేసాడు. వర్తమానం అందుకోవడమే ఆలస్యం వారం రోజుల ముందే పెద్ద కూతురు, అల్లుడు పిల్లజెల్లాతో దిగిపోయారు. మరునాడే చిన్న కూతురు అల్లుడు కూడా వచ్చారు. అప్పుచేసి తెచ్చిన డబ్బుల్లో ఇద్దరు అల్లుళ్ళకి చెరో వెయ్యి ఇవ్వాలనుకున్నాడు. మిగిలిన సొమ్ముతో కుటుంబ సభ్యులందరికి బట్టలు తీసి ఘనంగా పండగ జరుపుకోవాలనుకున్నాడు. తానొకటి తలిస్తే దైవం ఒకటి తలచినట్లు ఉన్నపళంగా డబ్బు మాయమవడమేంటి!..

***

''బీరువాలో పెట్టిన సొమ్ము కనబడలేదంటే ఎలా పోతుంది? ఖచ్చితంగా ఎవరో ఒకరు తీసుండాలి. పూసపాటిరేగలో అంజనం వేసే వ్యక్తి ఉన్నాడని విన్నాను. అతడి చేత అంజనం వేయిస్తే క్షణాలమీద డబ్బు ఎవరు తీసారో తేలిపోతుంది. ఉండు ఇప్పుడే వెళ్ళి అతగాడిని లాక్కొస్తాను'' అందరికి వినిపించేలా అన్నాడు భానుమూర్తి.

''మీకు మతిపోయిందా ఏంటి? ఈ మాట విన్నారంటే ఇంటికొచ్చిన వాళ్ళు ఏమనుకుంటారు?.. పోతే పోయింది వెధవ డబ్బు. నా గొలుసు అమ్మి డబ్బు పట్టుకురండి'' అంది భారతమ్మ పెనిమిటి ధోరణికి బెంగపడుతూ.

''మరేం పరవాలేదు'' అంటూ భార్య మాట వినిపించుకోకుండా బయటకు దారితీసాడు భానుమూర్తి.

ఆ డబ్బు ఎవరుతీసారో నింద ఎవరిమీద పడుతుందోనని బెంగపడ్డది భారతమ్మ.

దీపాలు పెట్టిన వేళకి ఇంటికొచ్చాడు భానుమూర్తి. వచ్చినవాడు ఎవర్నీ వెంటబెట్టుకుని రాలేదు. ఒంటరిగానే వచ్చాడు.

''మీరు తొందరపడ్డారు గాని డబ్బు ఎక్కడికి పోలేదండి. అందులోనే ఉంది. అనవసరంగా అంజనం వేసేవాడిని ఎక్కడ మోసుకొస్తారోనని హడలిచచ్చాను'' అంది భారతమ్మ పెనిమిటి వచ్చీ రాగానే. సంతోషంతో ఆమె మోము వెయ్యి వోల్టుల విద్యుత్ బల్బులా వెలిగిపోతోంది.

నవ్వి ఊరుకున్నాడు భానుమూర్తి.

అంజనం వేయిస్తే దొరికి పోతానేమోనన్న భీతితో డబ్బు కాజేసిన వ్యక్తి తిరిగి ఆ సొమ్మును ఉన్నచోట ఉంచేస్తాడని భానుమూర్తికి తెలుసు. అందుకే ఆ ట్రిక్కు ప్లే చేశాడు. డబ్బు ఎవరు తీస్తేనేం సొమ్ము దొరికింది అంతే చాలు అనుకుని సంతోషించాడు.

డబ్బుకి ఇబ్బంది తొలగడంతో ఆ సంక్రాంతి పండగ సాఫీగా గట్టెక్కి పోయింది.

*